సాక్షి నంద్యాల

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 2,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఒక గేటును ఎత్తి 456 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. కేసీ కాల్వకు 2,354 క్యూసెక్కులు వదిలారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: కార్తీక మాసం, శనివారం సందర్భంగా మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



నెల్లూరుకు ధర్మప్రచార రథం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మప్రచార రథం శనివారం ఉదయం నెల్లూరుకు బయల్దేరింది. అంతకు ముందు ప్రచార రథంలోని దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య క్షేత్రానికి కార్తీక రద్దీ



ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం శనివారం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులుదీరారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణతో పాటు స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజ, మహామంగళహారతి నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపారాధన చేశారు.

శ్రీశైలానికి తగ్గుతున్న వరద ప్రవాహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయానికి ఎగువ నఉన్న సుంకేసుల నుంచి వచ్చే వరద ప్రవాహం తగ్గుతుంది. శనివారం సాయంత్రానికి సుంకేసుల నుంచి కేవలం 456 క్యూసెక్కుల నీరు మాత్రమే శ్రీశైలానికి విడుదలవుతోంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 3,520 క్యూసెక్కుల నీటిని శుక్రవారం నుంచి శనివారం వరకు విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 1,013 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతలకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం జలాశయంలో 59.6316 టీఎంసీల నీరు నిల్వగా ఉండగా, డ్యాం నీటిమట్టం 838.50 అడుగులకు చేరుకుంది.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం లాంటిదని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి నంద్యాల జిల్లా డీఆర్‌డీఏ, వైకేపీ ఇన్సూరెన్స్ విభాగం నుంచి వైఎస్సార్ బీమా పొందిన కుటుంబ యజమానులు వివిధ ప్రమాదాల్లో 82 మంది మరణించారన్నారు. ఆయా కుటుంబాలు వైఎస్సార్ బీమాలో నమోదైన వారిలో ఇప్పటి వరకు 52 మంది నామినీలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున రూ.2.60 కోట్లు ప్రభుత్వం వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. మిగిలిన క్లయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీ త్వరలోనే జమ చేయడం జరుగుతుందన్నారు. వ్యక్తి మరణించి 24 గంటల్లోగా తప్పని సరిగా గ్రామ, వార్డు సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 19 రోజుల్లోగానే నామినీ ఖాతాలకు బీమా జమ అవుతుందన్నారు. తక్షణ సాయంగా రూ.10 వేలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో డీపీఎం దానం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరగాళ్ల ఆటకట్టు

- జిల్లాలో ఖాకీ ఉక్కు పిడికిలి
- ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా తగ్గిన నేరాల సంఖ్య
- 1000 మందికి పైగా పేకాట, మట్కా నిర్వాహకులు జైలుకు
- రూ. 47 లక్షల మేర నగదు స్వాధీనం
- తీవ్రమైన నేరాలకు పాల్పడే 21 మందిపై పీడీ యాక్ట్



చోరీకి గురైన బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)



బొమ్మలసత్రం: నేరాల నియంత్రణపై జిల్లా పోలీసులు పట్టు బిగుస్తున్నారు. జూదం, అక్రమ మద్యం రవాణా, చోరీలు, గంజాయి సరఫరా తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచి అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత పోలీసుశాఖ మరింత పటిష్టమైన నిఘాతో సత్ఫలితాలు సాధిస్తోంది. నంద్యాల నూతన జిల్లా ఆవిర్భావంతో పోలీస్‌శాఖలోని దాదాపు అన్ని విభాగాలకు పోలీస్ ఉన్నతాధికారులను నియమించారు. గత కొంత కాలంగా నంద్యాల జిల్లా కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి నిమగ్నమయ్యారు. రౌడీషీటర్లపై పీడీ యాక్ట్‌లు, నాటుసారా, గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు, నైట్ బీట్ వ్యవస్థలో మార్పులు చేసి నేరాల నియంత్రణ కోసం కృషి చేశారు. వీటితో పాటు పేకాట, మట్కా లాంటి జూదాలపై విస్తృత దాడులు కొనసాగిస్తున్నారు. ప్రజల శాంతిభద్రతలే లక్ష్యంగా కిరాతకుల పని పట్టేందుకు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని జైలుకు పంపటమే కాకుండా వారికి బెయిల్ కూడా మంజూరు కాకుండా కోర్టులో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గట్టుగా సాగుతున్న జూద స్థావరాలే లక్ష్యంగా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా పెట్టి పేకాటరాయుళ్ల భరతం పడుతున్నారు. మహానంది, ప్యాపిలి, బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డ తదితర పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట స్థావరాలపై దాడులు చేసి భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది మొత్తం 653 మంది పేకాట నిర్వాహకులు, పేకాటరాయుళ్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 147 కేసులు నమోదు కాగా వీటిలో స్వాధీనం చేసుకున్న నగదు రూ. 47 లక్షలు. అలాగే మట్కా నిర్వాహకులపై జిల్లా వ్యాప్తంగా 327 మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. మట్కా వ్యాపారుల నుంచి ఈఏడాది దాదాపుగా రూ. 8 లక్షల మేర నగదు స్వాధీనం చేసుకున్నారు.

రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ అస్త్రం....

ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీ రాత్రి నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్రనాథ్‌ను ఆరుగురు రౌడీషీటర్లు దారుణంగా కత్తులతో వెంటాడి అందరూ చూస్తుండగానే ఆటోలో కిడ్నాప్ చేసి అతికిరాతకంగా హత్య చేశారు. అప్పటి వరకు చిన్న చిన్న సంఘటనలు జరగటంతో తాత్సారం చేసిన పోలీసులు ఈ ఘటనతో ఒక్క సారిగా నేరగాళ్లపై కన్నెర్ర చేశారు. హత్య కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించిన తర్వాత పాత నేరస్తుల చరిత్రను బయటికి తీశారు. కొంత కాలంగా జిల్లాలో జనాలను బెంబేలెత్తిస్తున్న 14 మంది రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. వీరితో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మరో ఏడుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. అప్పటి నుంచి మిగతా రౌడీషీటర్లు మిన్నకుండి పెద్ద పెద్ద పట్టణాలకు వెళ్లి తలదాచుకున్నారు. ఇదే క్రమంలో కానిస్టేబుల్ హత్యకేసులో నలుగురు నిందితులకు బెయిల్ మంజూరు కాక ముందే పీడీ యాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు పంపారు. ఈ చర్యలు ప్రజల్లో ఒకింత ధైర్యాన్ని నింపుతున్నాయి.

నాటు ఘాటుపై ఉక్కుపాదం

సారా తయారీ, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏర్పాటు అనంతరం సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు 25, 125, 45 లక్షల లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 4,673 కేసులు నమోదు చేసి 2,916 మందిని అరెస్ట్ చేశారు. అలాగే సారా తరలించేందుకు ఉపయోగించిన 426 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 542 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఇదే క్రమంలో ఆపరేషన్ పరివర్తన్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించి సారా తయారీదారుల్లో మార్పు తీసుకొచ్చారు. జిల్లాలో 32 మందిని గుర్తించి రూ. 35 లక్షల మేర చిరు వ్యాపారాలు చేసుకునేందుకు అందించింది. దీంతో సారా వ్యాపారం చేసే వారి జీవనశైలిలో మార్పులు తీసుకొస్తున్నారు. అలాగే గంజాయి తరలింపుపై ప్రత్యేక నిఘా పెంచి గంజాయి జిల్లాకు చేరే మూలాలను గుర్తించి నిందితులను జైలుకు పంపుతున్నా రు. ఈ ఏడాది 32 గంజాయి కేసుల్లో 27 మందిని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఇప్పటి వ రకూ 317కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గస్తీ కట్టుదిట్టం చేసి..

కొంత కాలంగా పోలీసులు అనుసరిస్తున్న నైట్ బీట్ వ్యవస్థను జిల్లా ఎస్పీ సమర్థవంతంగా అమలయ్యేలా మార్పులు తీసుకొచ్చారు. రాత్రి సమయాల్లో గస్తీని పరిశీలించేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరుగురు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా నేరగాళ్ల గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్రైమ్ పార్టీ పోలీసులకు విధులు కేటాయించారు. 10 మంది సీఐలు, 18 మంది ఎస్‌ఐలు నైట్ బీట్‌కు వెళ్లి నిరంతరం తనిఖీ చేయటమే కాకుండా ఆ దృశ్యాలను ఫొటో తీసి డీఎస్పీ స్థాయి అధికారులకు పంపుతున్నారు. వారి ద్వారా అనుక్షణం జిల్లా ఎస్పీ గస్తీకి సంబంధించిన వివరాలను తెలుసుకుని సూచనలు అందజేస్తున్నారు.

- రెండు నెలల క్రితం నైట్ బీట్‌లో వచ్చిన మార్పుల ద్వారా జిల్లాలో పలు చోట్ల చోరీలకు పాల్పడిన 12 మంది అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11.50 కేజీల బంగారు అభరణాలు రూ. 25.75 లక్షల నగదు పట్టుకున్నారు.
- తరచూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే ఆరుగురిని పట్టుకుని జైలుకు పంపారు.
- రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జాతీయ రహదారులపై తరచూ స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులకు పోలీసులు నీటిని అందించి సమీపంలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను వివరిస్తున్నారు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు.



తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధం చేస్తున్న పోలీసులు (ఫైల్)

ఈఏడాది ప్రదాన రహదారుల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 6, 282 కేసులు నమోదు చేశారు.

ప్రజల శాంతిభద్రతలే లక్ష్యం



జిల్లాలో నేరాల నియంత్రణ కోసం కృషి చేస్తున్నాం. ఇప్పటికే నాటుసారా, గంజాయి విక్రయాలు పూర్తిగా అడ్డుకున్నాం. పేకాట, మట్కా లాంటి జూదాలపై ఉక్కుపాదం మోపి నిర్వాహకులను జైలుకు పంపుతున్నాం. ప్రజలకు శాంతిభద్రతలు అందించటమే తమ ధ్యేయంగా పని చేస్తున్నాం. నంద్యాల జిల్లాలో రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తిలేదు. ప్రస్తుతం జిల్లా ప్రశాంతంగా ఉంది. ల్యాండ్ మాఫియాకు పాల్పడిన వారిలో కొందరిని ఇప్పటికే జైలుకు పంపాం.

– కె. రఘువీర్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ

ఓటరు జాబితా సవరణలో తప్పులకు ఆస్కారమివ్వొద్దు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



ఓటరు సవరణ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: ఓటరు జాబితా సవరణలో తప్పులకు ఆస్కారమివ్వొద్దని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓల రిజిస్టర్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. సంబంధిత వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తూ జాబితాను రూపొందించాలన్నారు. బీఎల్‌ఓల రిజిస్టర్లను తనిఖీ చేస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ప్రొసీజర్ ప్రకారం క్లెయిమ్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఫైల్ చేసుకుని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ తనిఖీ సమయంలో ఓటర్లు జాబితాలో తప్పులు దొర్లినట్లు నిర్ధారణ అయితే సంబంధిత బీఎల్‌ఓలపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేకుండా ప్రతి చిన్న అంశాన్ని సీరియస్‌గా తీసుకొని రికార్డుల మేరకు ఓటర్ల జాబితాలో నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ 90.96 శాతం పూర్తి

నంద్యాల(న్యూటౌన్): డిసెంబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం నంద్యాల జిల్లాలో చురుగ్గా సాగుతుంది. పింఛన్ల పంపిణీ శనివారం కూడా కొనసాగింది. జిల్లాలో 2,21,508 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 2,03,713 మందికి (90.96శాతం) పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.



మిట్నాల గ్రామంలో తప్పెట కళాకారుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ పరదేశి పుల్లయ్య

గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 17వ తేదీన కర్నూలులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్ –1, గ్రూప్–2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో..సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత : ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్ గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8179100598 నంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 17, 2023 (ఆదివారం)

వేదిక:
టీజీవీ కళాక్షేత్రం, సీ క్యాంప్, కర్నూలు


సమయం:
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

పెద్దన్నలా ఆదుకున్నాడు



పదేళ్ల క్రితం నా భర్త తలారి చిన్న నాగరాజు అదృశ్యమయ్యాడు. ఇంత వరకు ఆచూకీ లేదు. మాకు ఎలాంటి ఆస్తులు లేవు. పెళ్లైన 30 ఏళ్ల తర్వాత పిల్లల్ని వదిలి నా భర్త ఎటు వెళ్లిపోయ్యాడో తెలియదు. ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడిని చూసుకుంటూ రెక్కల కష్టం మీదే ఆధారపడి జీవిస్తున్నాం. మా ఇంటి పెద్దన్నలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబాన్ని ఆదుకున్నారు. ఒంటరి మహిళ పింఛన్ వస్తోంది. గత తెలుగు దేశం పాలనలో పింఛన్ కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. ఒక్క రోజు కూలికి వెళ్లకపోతే ఆ రోజు పస్తుండాల్సిందే. కూలి పనికి వెళ్తూనే చిన్న కూతురిని చదివించాను. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేశాను. జగనన్న పాలనలో వలంటీరు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. నా రెక్కల కష్టానికి జగనన్న ఇచ్చే పింఛన్ ఎంతో ఆసరాగా నిలిచింది. ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, పొదుపులో వడ్డీ లేని రుణం ఇస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాను.

– తలారి లక్ష్మమ్మ, మాసపేట, మిడుతూరు మండలం



పేదలకు మంచి రోజులు



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు మంచి రోజులు వచ్చాయి. బడులు, ఆసుపత్రులు బాగయ్యాయి. సచివాలయాలు ఏర్పాటు చేసి పేదలకు మంచి చేశారు. మేము 15 ఏళ్ల నుంచి అద్దె ఇంటిలో ఉన్నాము. నేను, నా భర్త శ్రీధర్‌నాయక్ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇంటికి బాడుగ కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడ్డాం. గతంలో ఇంటి మంజూరుకు అర్జీలు పెట్టుకున్నా ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా సొంతింటి కల నెరవేరింది. ఏ అధికారి, రాజకీయ నాయకుల వద్దకు పోలేదు. వలంటీరుకు మా పరిస్థితి చెప్పాం. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం అంతే. కొద్ది రోజులకే జగనన్న కాలనీలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఇంటి పట్టా తీసుకున్నాం. ఆరోజు మాకు చెప్పలేని సంతోషం వేసింది. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఆర్థికసాయం చేసింది. ఇల్లు దాదాపు పూర్తికావచ్చింది. ఇప్పటికే కాలనీలో విద్యుత్, తాగునీరు వసతులు ఉన్నాయి. పేదలకు మంచి చేసే జగన్ మళ్లీ గెలుస్తారు.

– మినావత్ విజయశాంతి బాయి, బిలకలగూడూరు, గడివేముల మండలం

పలు రైళ్లు రద్దు

కర్నూలు(రాజ్‌విహార్): కోస్తా, నెల్లూరు జిల్లాలో తుఫాన్ వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్కోడగామా నుంచి కాచిగూడకు వెళ్లే స్లిప్ కోచ్ (రైలు నంబర్ 18048/17604)ను ఆదివారం, కాచిగూడ నుంచి వాస్కోడగామాకు వెళ్లే స్లిప్ కోచ్ (రైలు నంబర్ 17603/18047)ను ఈ నెల 5వ తేదీన రద్దు చేస్తున్నట్లు సీపీఆర్‌ఓ రాకేష్ పేర్కొన్నారు.

నేడు 15 కేంద్రాల్లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్‌ఎంఎంఎస్–జాతీయ ఉపకార వేతన)పరీక్షను ఆదివారం జిల్లాలోని 15 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 3,503 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. నంద్యాలలో 7, ఆత్మకూరులో 4, డోన్‌లో 4 కేంద్రాల్లో పరీక్ష సజావుగా నిర్వహించేందుకు 15 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 15 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



ఫుట్‌బాల్‌లో ఫైనల్‌కు చేరుకున్న సెయింట్ జోసఫ్ కళాశాల జట్టుతో వర్సిటీ అధికారులు

కర్నూలు (టౌన్): విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా క్రీడల్లో సాధన చేస్తే మానసికంగా ఉల్లాసంగా ఉంటారని రాయలసీమ యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌యూ ప్రాంగణంలో హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, సెపక్‌తక్రా క్రీడాంశాల్లో అంతర్ యూనివర్సిటీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ పోటీల్లో 5 జట్లు, ఫుట్‌బాల్‌లో 9, సెపక్‌తక్రా పోటీల్లో 5 జట్లు పాల్గొన్నాయన్నారు.

పోటీల వివరాలు : హ్యాండ్‌బాల్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో రాయలసీమ యూనివర్సిటీ కళాశాల జట్టుపై సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు 15–09 స్కోర్ తేడాతో గెలుపొందింది. రెండో సెమీ ఫైనల్‌లో రాఘవేంద్ర డిగ్రీ కళాశాల (ఆలూరు) జట్టుపై ఉస్మానియా కళాశాల జట్టు 10–0 స్కోర్‌తో గెలుపొంది ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఫుట్‌బాల్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు (పత్తికొండ) జట్టుపై సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు 4–3 స్కోర్‌తో గెలుపొందింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (డోన్) జట్టుపై ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు 4–0 స్కోర్ తేడాతో గెలుపొందింది. సెపక్‌తక్రా విభాగంలో సెమీ ఫైనల్‌లో ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల జట్టుపై ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

మద్దిలేటయ్యకు ఒక్క రోజు ఆదాయం రూ.5.67 లక్షలు

బేతంచెర్ల: జిల్లాలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం ఒక్క రోజు రూ. రూ.5,67,736 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. కార్తీక మాస శనివారం పురస్కరించుకొని భక్తులు భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా భక్తులు స్వామిని వారిని సేవించడం, ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు విరాళంగా అందివ్వడంతో ఈ ఆదాయం వచ్చింది. ఆలయ అభివృద్ధికి అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం శ్రీరాములు పేటకు చెందిన మదన గోపాల్ రూ. 78,500 విరాళం అందజేశారు. ఈ మేరకు దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

రైల్వే కాంట్రాక్టర్ కార్యాలయం సీజ్



రైల్వే కాంట్రాక్టర్ కార్యాలయాన్ని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): నంద్యాల– బేతంచెర్ల మధ్య జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనుల్లో అక్రమంగా గ్రావెల్ ఉపయోగిస్తుండటంతో పాణ్యం మండలం కౌలురు గ్రామంలో ఉన్న రైల్వే కాంట్రాక్టర్ కార్యాలయాన్ని అధికారులు సీజ్ చేశారు. రికార్డులను, కంప్యూటర్ హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రెండు టిప్పర్లను కూడా సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. భూగర్భ గనుల శాఖ అధికారులు రాజగోపాల్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు నవీన్, మురహరి, తిరుపతిరావు తదితరులు తనిఖీలు చేయగా.. రైల్వే డబ్లింగ్ పనుల్లో అక్రమంగా గ్రావెల్ ఉపయోగిస్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనలు పాటించకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మరింత పారదర్శకంగా 'ఉపాధి'

- అక్రమాలకు తావు లేకుండా ముఖ గుర్తింపు హాజరు
- రోజుకు 60 వేల మందికి పనులు
- కరువు నేపథ్యంలో పెరుగుతున్న డిమాండ్
- కరువు మండలాల్లో పనిదినాలు 150 రోజులకు పెంపు



ఉపాధి పనులకు హాజరైన కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేస్తున్నారు. బోగస్‌కు తావులేకుండా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) ద్వారా ప్రతి రోజూ రెండు సార్లు హాజరు తీసుకుంటున్నారు. కూలీల సంఖ్య కనిపించే విధంగా ఫొటో తీసి ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికి అదనంగా కూలీల ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

గతంలో అక్రమాలు ఇలా..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో 2014–2019 మధ్య కాలంలో అక్రమాలు వెల్లువెత్తాయి. అప్పట్లో బోగస్ హాజరు వేసి టీడీపీ నాయకులు కూలీల వేతనాలు కొల్లగొట్టారనే విమర్శలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో 80 శాతం నిధులు కాజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నారు. దీంతో అక్రమాలు కూడా గణనీయంగా తగ్గినట్లు సామాజిక తనిఖీల్లో నిర్ధారణ అవుతోంది. 'ఉపాధి'లో 100 శాతం పారదర్శకతను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది.

రేపటి నుంచి ఆధారిత ముఖ గుర్తింపు హాజరు

బోగస్ హాజరుకు అవకాశం లేకుండా ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు వేసేందుకు ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 6 నుంచి ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరును ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లోనే నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా ప్రతి రోజు 2 సార్లు హాజరు తీసుకుంటున్నారు. ఉదయం 7 గంటలకు యాప్‌లో హాజరు వేస్తే మళ్లీ 4 గంటల తర్వాత హాజరు వేస్తున్నారు. వీటికి అదనంగా ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు యాప్‌లో నమోదు చేస్తారు. విధానంతో బోగస్ మస్టర్‌లకు అవకాశం ఉండదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యే అవకాశం ఉంటుంది.

పెరుగుతున్న కూలీల సంఖ్య

2023–24లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 24 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కరువు మండలాల్లో ఉపాధి పనిదినాలను కుటుంబానికి 100 రోజుల నుంచి 150 రోజుకు పెంచింది. రోజుకు ఉపాధి పనులకు కూలీల హాజరు కూడా దాదాపు 60 వేలకు పెరగడం విశేషం. శనివారం 56,544 మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. సోమవారం నుంచి ఉపాధి పనులకు హాజరు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. పనికి వెళ్లిన ప్రతి ఒక్కరికి రూ.265 నుంచి రూ.272 వరకు వేతనం లభించే విధంగా చ ర్యలు తీసుకుంటున్నారు.

వలసల నివారణ

2023–24లో 95 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 78.99 లక్షల పని దినాలు కల్పించారు. ఇందులో 3,443 కుటుంబాలకు 100 రోజులు పని దినాలు కల్పించారు. కరువు నేపథ్యంలో ఈ కుటుంబాలు మరో 50 పని దినాలను వినియోగించుకునే అవకాశం లభించింది. టీడీపీ హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలసలు గణనీయంగా తగ్గిపోయాయి. హాలహర్విలో అత్యధికంగా 3,23,825 పనిదినాలను ఉపాధి కూలీలు వినియోగించుకున్నారు. ఆలూరులో 3,24,705, హొళగొందలో 3,09,691, ఓర్వకల్లులో 4,00,807, కౌతాళంలో 2,78,104, కోసిగిలో 3,54,440, పత్తికొండలో 4,49,173, ఆదోనిలో 5,13,586, సి.బెళగల్‌లో 3,56,843, మద్దికెరలో 2,54,747, మంత్రాలయంలో 2,28,915 చిప్పగిరి మండలంలో 2,20,983 ప్రకారం పనిదినాలను కల్పించారు.

అక్రమాలకు తావులేకుండా చర్యలు



ఉపాధి పనుల్లో అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల బోగస్ హాజరు తగ్గిపోయింది. మస్టరులో 100 శాతం పారదర్శకత ఉండాలనే లక్ష్యంతో కూలీల ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరును నమోదు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాం.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

● దీప కాంతులు

కార్తీకదీపాలను వెలిగించి పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు



శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢ వీధిలో కార్తీకదీపారాధన చేసుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో లక్ష వత్తులు, వెయ్యి వత్తులు, శివలింగాకార దీపాలు, ఓం నమఃశివాయ కారంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు.

39 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పరిహారం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ బీమా కింద రాష్ట్రంలో 1.33 కోట్లకుపైగా రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల విలువ బీమా పథకాన్ని అమలు చేస్తోందని డీఆర్‌డీఏ–వైకేపీ సామాజిక భద్రత జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రెహిమాన్ తెలిపారు. 18–50 సంవత్సరాల వయస్సు వారు సహజ మరణం పొందితే రూ.లక్ష, 18–70 ఏళ్ల వయస్సు వారు ప్రమాదవశాత్తూ మరణించినా లేదా శాశ్విత అంగవైకల్యం పొందినా రూ.5 లక్షలు పరిహారం లభిస్తుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.వైఎస్ఆర్ బీమా కింద 2023–24 సంవత్సరానికి జిల్లాలో 63 మంది పాలసీదారులు ప్రమాదవశాత్తూ మరణించారన్నారు.వీరికి సంబంధించి క్లెయిమ్ పత్రాలనుబీమా కంపెనీకి పంపగా 10 రోజుల్లోనే 39 క్లెయిమ్‌లు పరిష్కారం అయ్యాయన్నారు.

డోన్ వ్యవసాయ సబ్ డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు

డోన్: మేలైన యాజమాన్య పద్ధతులతో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించడంలో డోన్ వ్యవసాయ సబ్ డివిజన్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు లభించినట్లు ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, డోన్ ఏఓ అబ్దుల్ షఫీ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పొలంబడి ద్వారా ఆర్గానిక్ సర్టిఫికెట్ తీసుకోవడానికి ఏపీలో నంద్యాల జిల్లా డోన్ వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. 2023లో కొర్ర పంటను ప్రధానంగా ఎంచుకొని మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన 49 మంది రైతులతో 25.2 హెక్టార్లలో పూర్తి సేంద్రియ పద్ధతుల సాగు చేసి 161 క్వింటాళ్ల దిగుబడిని సాధించారన్నారు. పంట నమూనాలను సేంద్రియ ఎరువుల వ్యవసాయ ఉత్పత్తుల పరీక్షల కేంద్రం బెంగళూరుకు పంపి ఎలాంటి పురుగు మందుల అవశేషాలు లేవని నిర్ధారించారన్నారు. ఇదే నమూనాను గుంటూరు విత్తన ధ్రువీకరణ సంస్థ వారు తీసుకువెళ్లి పలు దఫాలు పరీక్షలు నిర్వహించారన్నారు. సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన 33 మంది రైతుల ధాన్యాన్ని క్వింటాకు రూ.5,400 చొప్పున, ఏడుగురు దిగుబడిని రూ.6వేల చొప్పున, ఐదుగురి రైతుల దిగుబడిని రూ.6,300 చొప్పున, మిగిలిన ఒక రైతు పంటను క్వింటానికి రూ.7వేల చొప్పున విక్రయించారన్నారు. సరాసరి ఒక్కొక్క రైతు ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి సాధించి రూ.28 వేల ఆదాయం పొందినట్లు తమ అధ్యయనంలో వెల్లడైందన్నారు. పురుగు మందు అవశేషాలు లేని దిగుబడిని సాధించిన రైతులకు మార్కెట్లో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయన వివరించారు. 49 మంది రైతులందరికీ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణనిచ్చి స్వశక్తి ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజర్ సంస్థతో లింకు చేయడం ద్వారా ఈ పంట దిగుబడులు సాధ్యమయ్యాయన్నారు. ఇలాంటి పద్ధతులను వచ్చే సీజన్‌లో కూడా అవలంభిస్తామన్నారు. సర్టిఫికెట్ లభించడం అధికారులు, రైతులకు గర్వకారణమన్నారు.

బైక్ సైడు బ్యాగులో నగదు చోరీ

పత్తికొండ రూరల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకుని తిరిగి వెళ్తున్న ఓ వ్యక్తి బైక్ సైడుబ్యాగులో ఉంచుకున్న రూ.1.70లక్షలు నగదును అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని పందికోన గ్రామానికి చెందిన కడవల సుధాకర్ సాగు చేసిన మిరప పంటను రెండు రోజుల కిందట గుంటూరుకు వెళ్లి విక్రయించాడు. శనివారం బ్యాంకులోకి నగదు జమ కావడంతో భార్య మంజులతో కలిసి బ్యాంకుకెళ్లి నగదును డ్రా చేశారు. గ్రామానికి బయల్దేరి దారి మధ్యలో స్టాల్ వద్ద సిమ్‌కార్డు తీసుకున్నారు. తరువాత కొంత ముందుకెళ్లి బైక్ సైడుబ్యాగు చూసుకోగా అందులో నగదు కనిపించలేదు. దీంతో ఆందోళనతో బాధితుడు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని సీఐ మురళీమోహన్ తెలిపారు.

నేడు కర్నూలుకు మత్స్య శాఖ మంత్రి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం కర్నూలులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం స్టేట్ గెస్ట్ హౌస్‌లో మత్స్యకారులు, గంగపుత్రులు, ఇతరుల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం కర్నూలు బుధవారపేటలో మెడికల్, డెంటల్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం కోడుమూరు రోడ్డులోని శేషన్న నగర్‌లోని గంగపుత్రుల కమ్యూనిటీ హాల్‌లో జరిగే గంగపుత్రుల కార్తీక వన భోజన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శ్రీశైలం వెళ్తారు. మంత్రి వెంట రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ కూడా ఉంటారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువును మరోసారి పొడిగించినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి తెలిపారు. పరీక్ష ఫీజులతో పాటు, ఒకేషనల్ అభ్యర్థులు, మైగ్రేషన్ సర్టిఫికేట్ల కోసం రుసుము ఆన్‌లైన్‌లో నామినల్ రోల్‌తో పాటు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు గడువు పొడిగించారని, రూ.50 ఆలస్య రుసుంతో ఈ నెల 10వ తేదీలోపు, రూ.200 ఫైన్‌తో 12వ తేదిలోపు, రూ.500 ఫైన్‌తో 14వ తేది లోపు ఫీజు చెల్లించవచ్చన్నారు. షెడ్యూల్ కులాలు/షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు.

మిత్రుడి మరణంతో భయపడి..

- ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి
- మృతదేహాన్ని గని గుంతలో పడేసిన స్నేహితుడు
- పోలీసులు విచారణలో వాస్తవాలు వెలుగులోకి



మృతి చెందిన యువకుడు హరికృష్ణ



ప్రమాదానికి కారణమైన ప్రసాద్

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కాగా వెంట వున్న మృతుడి స్నేహితుడు భయంతో కట్టుకథ అల్లగా, పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అంకిరెడ్డిపల్లెకు చెందిన యువకులు వల్లపు హరికృష్ణ(17), బత్తుల ప్రసాద్ మంచి స్నేహితులు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని నాపరాతి గనిలోకి వెళ్లి ట్రాక్టర్‌లో గోడరాళ్లు నింపుకొని బయటకు వచ్చారు. సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపైకి రాగానే డ్రైవింగ్ చేస్తున్న ప్రసాద్ ట్రాక్టర్ ఇంజన్‌ను గాల్లోకి లేపాడు. ఇంజన్‌పై కూర్చున్న హరికృష్ణ అదుపు తప్పి కింద పడటంతో ట్రాక్టర్ టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన కారణంగానే ప్రమాదం చోటు చేసుకోవడంతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రసాద్ హైడ్రామాకు తెరలేపాడు. సంఘటన స్థలం నుంచి నేరుగా ఊరికి వెళ్లి హరికృష్ణను లారీ ఢీకొని మృతి చెందాడని, తనపైకి లారీ డ్రైవర్, క్లీనర్ ఇద్దరు ఇనుప రాడ్లతో దాడి చేసేందుకు యత్నించడంతో ప్రాణభయంతో వచ్చానని చెప్పాడు. వెంటనే ఇద్దరి యువకులకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన రోడ్డుపై నెత్తుటి మరకల తప్ప మృతదేహం కనిపించక పోవడంతో చుట్టూ పక్కల గాలించారు. ప్రమాదం జరిగిన చెంతనే ఉన్న రాళ్ల గుట్టలపై రక్తపు మరకలు కనిపించడంతో వాటి ఆధారంగా గుట్టపైకి ఎక్కి చూడటంతో గని గుంతలో హరికృష్ణ మృతదేహం కనిపించింది. కోవెలకుంట్ల సీఐ రామాంజులు ప్రమాద స్థలానికి చేరుకొని గని గుంతలో పడేసిన మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా అంకిరెడ్డిపల్లెలో ప్రసాద్ ఇంటి వద్ద నిలిపిన ట్రాక్టర్ వద్దకు వెళ్లి పరిశీలించగా టైర్లకు రక్తపు మరకలు కనిపించాయి. ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇవ్వడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌లో నుంచి హరికృష్ణ కింద పడగానే మృతి చెందాడు. ఆ సమయంలో ప్రధాన రహదారిపై వాహనాల రాక పోకలు లేక పోవడంతో క్షణాల్లో మృతదేహాన్ని చెంతనే ఉన్న నాపరాతి గని గుంతలోకి పడేసినట్లు ప్రసాద్ నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పెద్దపులి దాడిలో బర్రె మృతి

ఆత్మకూరురూరల్: ముష్టపల్లె గ్రామ పంట పొలాల్లో మేతకు వెళ్లిన బర్రెపై శుక్రవారం పెద్దపులి దాడి చేసి చంపేసింది. శుక్రవారం మేతకు వెళ్లిన బర్రె రాత్రి పొద్దుపోయిన తరువాత కూడా ఇంటికి రాకపోవడంతో బర్రె యజమాని చెల్లె కృష్ణుడు శనివారం ఉదయం పొలాల్లో వెతకగా బర్రె కళేబరం కనిపించింది. బర్రె శరీరంపై ఉన్న గాయాలు, పక్కనే ఉన్న అడుగు జాడలు చూసిన ఆయన ఇది పులి దాడి యేనని నిర్ధారణకు వచ్చారు. అధికారులకు సమాచారం ఇచ్చారు.

డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు నెలల్లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఫలితాలు rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎవరైనా విద్యార్థులు పునః మూల్యాంకనానికి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్ వద్ద ఈనెల 9వ తేదీలోగా రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి బీఏ కోర్సుల్లో 871 మందికి 316, బీబీఏలో 310 మందికి 196, బీసీఏలో 188 మందికి 171, బీకాంలో 2,573 మందికి 1,276, బీఎస్సీలో 2,210 మందికి 1,262, బీఓఎల్‌లో 23 మందికి ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. నాలుగో సెమిస్టర్‌కు సంబంధించి బీఏ కోర్సుల్లో 1,696 మందికి 879, బీబీఏలో 439 మందికి 293, బీసీఏలో 160 మందికి 130, బీకాంలో 3,470 మందికి 918, బీఎస్సీలో 4,531 మందికి 2,306, బీఓఎల్‌లో 11 మందికి 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

బీఈడీ ఫలితాలు విడుదల

రాయలసీమ విశ్వవిదాలయం పరిధిలో ఆగస్టు లో జరిగిన బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేశారు. 1631 మంది విద్యార్థులకు 929 మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు పునః మూల్యాంకనానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద ఈనెల 9వ తేదీ లోగా తగిన రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

5 నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 12 కాలేజీలు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. పలు విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, తదితరులు పోటీలు విడివిగా జరుగుతాయన్నారు.